నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

రాజేంద్రనగర్: విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ అధికారులు తెలిపారు. ఆదర్శనగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని ఆదర్శనగర్ విలేజ్, మంజు బార్, ఆరాంఘర్ పిస్తాహౌజ్, రామయ్య హస్పిటల్, కింగ్స్ సరేనయ్య, లక్ష్మీనారాయణ విల్లాస్ తదితర ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

అత్తాపూర్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వెంకటరామిరెడ్డి తెలిపిన మేరకు.. అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ సమీపంలో శుక్రవారం 56–60 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పడి ఉంది. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

దూర విద్య కోర్సులకు దరఖాస్తు గడువు పెంపు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ వర్చువల్ లెర్నింగ్(సీడీవీఎల్) ఆధ్వర్యంలో దూరవిద్యా కోర్సులకు దరఖాస్తు గడువును పెంచారు. మార్చి 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు పేర్కొన్నారు. ముఖ్యంగా బ్లెండెడ్ మోడ్ ద్వారా అందించే ఒక సంవత్సరం డిప్లొమో కోర్సుల కోసం దరఖాస్తులను కోరుతోంది. ఈ కోర్సులు యూజీసీ, ఏఐసీటీఈ, డీఈసీ జాయింట్ కమిటీచే ఆమోదించబడిన కోర్సులు ఉన్నాయి. మరిన్ని వివరాలకు వెబ్‌సైట్ నుంచి ప్రాస్పెక్టస్ డౌన్ లోడ్ చేసుకోవాలి. రిజిస్ట్రేషన్ ఫీజు రూ.300 పూర్తి చేసిన దరఖాస్తులను ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ఫీజు రసీదుతోపాటు సెక్షన్ ఆఫీసర్ సెంటర్ ఫర్ డిస్టెన్ అండ్ వర్చువల్ లెర్నింగ్‌కి పంపవచ్చు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్లు 040–24600264, 040–24600265లో సంప్రదించాలి.

దేవుడి భూములకే ఎసరు!

- నెక్నాంపూర్‌లో 28.24 ఎకరాలు అన్యాక్రాంతం
- దేవాదాయ శాఖ భూముల్లో నిర్మాణాలకు అనుమతులు
- చర్యలు తీసుకుంటామంటున్న అధికారులు



దేవాదాయ శాఖ భూమికి ఏర్పాటు చేసిన ప్రహరీ



దేవాలయానికి భూముల వివరాల పెయింటింగ్ బోర్డు

మణికొండ: అవన్నీ ఓ దేవాలయం పేరుతో ఉన్న దేవాదాయ శాఖకు చెందిన భూములు. వాటిని దేవాలయ అభివృద్ధి, నిర్వహణకు వాడుకోవాల్సిన ఆలయ పూజరులు ఓ రియల్టర్‌కు తెగనమ్ముకున్నారు. దాంతో వాళ్ల ప్లాట్లు చేసి విక్రయించుకున్నారు. అయినా అవి దేవాదాయ శాఖకే చెందుతాయని ఈ మధ్య కాలంలోనే దేవాలయం పేరుతోనే పాస్‌బుక్కు జారీ చేశారు. కోర్టులోను పలు కేసులు నడుస్తున్నాయి. వాటిని పరిరక్షించాల్సిన దేవాదాయ శాఖ అధికారులు కోర్టు కేసులను పట్టించుకోకుండా సదరు భూమిలో వస్తున్న నిర్మాణాలకు అపుడపుడు నోటీసులు జారీ చేయటం, అందిన కాడికి దండుకోవటం చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ప్లాట్ల రూపంలో ఎకరాల కొద్ది భూములు పోయినా కనీసం దేవాలయం ముందర ఉన్న నాలుగు ఎకరాలు, అక్కడక్కడ మరో నాలుగు ఎకరాల భూమి అయినా మిగిలి ఉందని స్థానికులు ఇప్పటి వరకు భావించారు. కానీ ఇపుడు ఏకంగా దేవాలయం ముందు మిగిలి ఉన్న ఆ నాలుగెకరాల భూములకు ప్రహరీలు ఏర్పాటు చేసి రియల్టర్ తమ ఆదీనంలోకి తీసుకునే ప్రయత్నం చేస్తుండటంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పూర్తి వివరాల్లోకి వెలితే గండిపేట మండలం, నెక్నాంపూర్ గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 112, 116, 125లో శ్రీ గణేష్ దేవాలయం పేరుతో 28.24 ఎకరాల భూమి ఉంది. అదే భూమిలో ఉన్న శ్రీ గణేషుడి దేవాలయంతో పాటు అదే ఆవరణలో తుల్జారాం బాగ్‌లో పలు దేవాలయాలను నిర్మించారు. దశాబ్దాల కాలంగా దేవాలయానికి పూజులుగా పనిచేసిన వారి ఆదీనంలోనే భూములు ఉండేవి.

రియల్టర్‌కు అమ్మకం...

మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పుప్పాలగూడ, నెక్నాంపూర్ గ్రామాల రెవెన్యూ పరిధిలో 1990 సంవత్సరంలో అలకాపూర్ టౌన్‌షిప్ పేరుతో వందల ఎకరాలలో వెంచర్ చేశారు. దానికి ఆనుకునే శ్రీ గణేష్ దేవాలయం భూములు సైతం ఉండటంతో కారుచౌకగా కొనుగోలు చేసి లేఅవుట్‌లో కలుపుకున్నారు. హెచ్ఎండీఏ, గ్రామ పంచాయతీల అనుమతులతో వేసిన లేఅవుట్‌లతో పాటు దేవాలయం భూములను అమ్మకాలు చేశారు. విషయం తెలియని వందలాది మంది వాటిని కొనుగోలు చేశారు. అలా కొనుగోలు చేసిన వారివి పోను మరో 8 ఎకరాల వరకు రియల్టర్ వద్దనే మిగిలి ఉండటంతో వాటినైనా దేవాలయానికి ఉంచాలని స్థానికులు అప్పట్లో పోరాటాలు చేశారు. దాంతో ఇప్పటి వరకు మిన్నకున్న రియల్టర్ ప్రస్తుతం సదరు భూములకు ప్రహరీలు నిర్మిస్తూ తమ ఆదీనంలోకి తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని స్థానికులు పేర్కొన్నారు.

తలాపాపం తిలాపిడికెడు...

దేవాదాయ శాఖకు చెందిన భూమిని రిజిస్ట్రేషన్ యాక్ట్ 1908, సెక్షన్ 22ఎ ప్రకారం అమ్మటానికి కొనటానికి అవకాశం లేదు. అయినా అలాంటి భూములను రిజిస్ట్రేషన్ శాఖ యథేచ్ఛగా రిజిస్ట్రేషన్‌లు చేసింది. వాటిల్లో నిర్మాణాలకు అనుమతులు ఇచ్చే అవకాశం లేక పోయినా అప్పటి గ్రామపంచాయతీ, ఇప్పటి హెచ్ఎండీఏ, మున్సిపల్ శాఖలు ఇచ్చేశాయి. సదరు లేఅవుట్‌లో మున్సిపల్ శాఖ నుంచి నిధులను వెచ్చించి డ్రైనేజీ, రోడ్ల నిర్మాణాలను చేపట్టారు. వాటిని సకాలంలో అడ్డుకోవాల్సిన రెవెన్యూ, ఎండోమెంట్ శాఖల అధికారులు అందినకాడికి దండుకుని మిన్నకున్నారనే విమర్శలు ఉన్నాయి. విద్యుత్ శాఖ అధికారులు దేవాదాయ భూమిలో మీటర్లు మంజూరు చేయవద్దని పలు శాఖల అధికారులు లేఖలు రాసినా అవేమి పట్టించుకోకుండ ఇష్టారాజ్యంగా జారీ చేస్తున్నారు. అన్ని శాఖల నిర్వాహకం వలన దేవాలయానికి చెందిన భూములు అన్యాక్రాంతం అయ్యాయని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి మిగిలి ఉన్న భూమిలో వస్తున్న నిర్మాణాలను అడ్డుకుని దేవాలయ భూములను పరిరక్షించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

పోలీసులకు ఫిర్యాదు చేశాం

నెక్నాంపూర్ రెవెన్యూ పరిధిలో శ్రీ గణేష్ దేవాలయం భూములలో వస్తున్న నిర్మాణాల విషయంలో ఫిర్యాదులు వచ్చాయి. అదే విషయాన్ని ఎండోమెంట్ శాఖ అధికారుల దృష్టికి తీసుకుని వెల్లాము. అయినా వారి నుంచి ఆశించిన మేర స్పందన లేదు. దాంతో తాము నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశాం. వారిపై క్రిమినల్ కేసులను నమోదు చేయించటంతో పాటు నిర్మాణాలను కూల్చివేస్తాం.

–ఎస్.శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్, గండిపేట మండలం

చర్యలు తీసుకుంటాం

గండిపేట మండలం, నెక్నాంపూర్ రెవెన్యూ పరిధిలోని 28.24 ఎకరాల భూమి అన్యాక్రాంతంపై వివరాలను సేకరించాం. వాటిల్లో వచ్చిన నిర్మాణాలపై ఎప్పటికైనా చర్యలు తప్పవు. దేవాలయం ముందు మిగిలి ఉన్న భూమికి ప్రహరీలు ఏర్పాటు చేస్తున్న విషయం తమ దృష్టికి వచ్చింది. ఇప్పటికే వాటిని పరిశీలించాలని తమ సిబ్బందిని ఆదేశించాము. త్వరలోనే వాటిని కూల్చి భూములను పరిరక్షిస్తాము.

–అనిల్‌కుమార్, కమీషనర్, దేవాదాయ శాఖ

నీటి సమస్యను పరిష్కరించాలి



మేయర్ మహేందర్‌గౌడ్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న శివసాయి కాలనీ మహిళలు

బండ్లగూడ: వేసవి కాలంలో మంచినీటి సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చొరవ తీసుకుంటామని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్ తెలిపారు. బైరాగిగూడ శివసాయి కాలనీలో నెలకొన్న నీటి కొరత సమస్యను శుక్రవారం కాలనీ మహిళలు మేయర్ మహేందర్‌గౌడ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మేయర్ స్పందించి సమస్యకు తగు చర్యలు తీసుకోని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మాట్లాడుతూ జలమండలి అధికారులకు సమస్యను వివరించేందుకు సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేసి వివరిస్తామన్నారు. ఆర్మీ స్కూల్ మెయిర్ రోడ్డు దగ్గర ఉన్న వాటర్ లైన్ ద్వారా త్వరలో అధికారులతో చర్చించి అనుమతి తీసుకొని కాలనీని వాటర్ లైన్ కలుపుతామన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో కాలనీ మహిళలు హేలిశ్రీ, సౌమ్య, రాజేశ్వరి, సునీత, దీన తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారాలు



రోడ్డు పనులను పరిశీలిస్తున్న గోకరి సురేష్‌గౌడ్

బండ్లగూడ: ప్రజా ఇబ్బందులను ఎప్పటికప్పుడు తెలుసుకొని వాటికి శాశ్వత పరిష్కారాలు చూపిస్తామని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ 18వ డివిజన్ కార్పొరేటర్ గోకరి శ్రీలతసురేష్‌గౌడ్ అన్నారు. శ్రీసాయి కాలనీ, ఆనంద్‌నగర్ కాలనీ, ఆనంద్ ఎన్‌క్లేవ్‌లలో గోతులమయమైన రోడ్లకు మరమ్మతు పనులను చేయించారు. తన సొంత నిధులతో 120 ట్రిపుల మొరం మట్టిని రప్పించి గోతులమయమైన రోడ్లను పూడ్చివేశారు. జేసీబీ సహాయంతో చదును చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. అలాగే వివేకానంద నగర్‌లో మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తుండడంతో స్థానికులు ఆయన దృష్టికి తీసుకురావడంతో వెంటనే అధికారులతో చర్చించి డ్రైనేజీ లీకేజీలకు మరమ్మత్తులు చేయించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అల్కాపూర్‌లో పేలిన సిలిండర్



మంటలు అంటుకున్న టీ కొట్టు

మణికొండ: రోడ్డు పక్కన నడుపుకుంటున్న టీ కొట్టులో సిలిండర్ పేలి మంటలు లేచాయి. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని అలకాపూర్ టౌన్‌షిప్ రోడ్ నెంబర్ 4 వద్ద ఓ వ్యక్తి టీకొట్టును నడుపుకుంటున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం ఒక్కసారిగా సిలిండర్ పేలి మంటలు లేచాయి. దాంతో టీకొట్టులోని ఫర్నిచర్ పూర్తిగా కాలిపోయింది. ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవటంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. పక్కనే ఉన్న బోరు నుంచి పైప్ వేసి మంటలను ఆర్పి వేశారు.

ఉత్సాహంగా స్లీప్‌డే



మణికొండ: ప్రపంచ నిద్ర దినోత్సవాన్ని సెంచరీ మ్యాట్రెస్, బిగ్ ఎఫ్ఎంలు సంయుక్తంగా గండిపేట చెరువు పక్కన ఆహ్వానం రిసార్ట్‌లో శుక్రవారం రాత్రి స్లీప్ కచేరి పేరుతో నిర్వహించా యి. 'భారత దేశంలో అతిపెద్ద కూలెస్ట్ స్లీప్ కాన్సెప్ట్' అనే కార్యక్రమంలో బాగంగా నిద్రను ప్రేరేపించే ఈవెంట్‌ను నిర్వహించారు. సౌండ్ స్లీప్ ప్రాముఖ్యత, ప్రజలు వారి నిద్ర సమస్యలను అధిగమించేందుకు సెంచరీ మ్యాట్రెస్ ఈ నిద్రను ప్రేరేపించే కార్యక్రమాన్ని నిర్వహించిందని జీఎం విజయ్‌కుమార్ అన్నారు. బీగ్ ఎఫ్ఎం సీఈఓ సునీల్ కుమారన్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయం దారి మూసివేత



మున్సిపల్ కార్యాలయం వైపు ఉన్న ఓ దారిని మూసివేస్తున్న సిబ్బంది

మణికొండ: మున్సిపల్ కార్యాలయానికి రెండు వైపుల నుంచి ఉన్న దారులలో ఒకటి మూసి వేస్తున్నారు. మణికొండ మున్సిపల్ కార్యాలయం ఏర్పాటు సమయంలో ఎక్కడా అనువైన భవనం లేక పోవటంతో పుప్పాలగూడలోని డ్వాక్రా భవనాన్ని మున్సిపల్ కార్యాలయానికి తీసుకున్నారు. అందులోను సరిపోను స్థలం లేక గత సంవత్సరం పైన రేకులతో మరో అంతస్తు పెంచుకున్నారు. అయినా సౌకర్యవంతంగా లేక పోవటంతో జిల్లా కలెక్టర్‌కు పరిస్థితిని వివరిస్తూ లేఖ రాశారు. దాంతో అప్పటి కలెక్టర్ మణికొండ ల్యాంకోహిల్స్ పక్కన 30 గుంటల ప్రభుత్వ భూమిని కేటాయించారు. అందులో నూతన భవన నిర్మాణ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. ప్రస్తుతం ఉన్న కార్యాలయానికి రెండు దారులు ఉన్నాయి. అలా ఉండవద్దని గతంలో ఎంతో మంది అధికారులకు తెలిపారు. అయినా వారు ఆ విషయాన్ని పట్టించుకోకుండా విదులు నిర్వర్తించారు. కొత్తగా వచ్చిన కమీషనర్ మాత్రం ఆవిషయాన్ని గమనించి వాయువ్యంలోని దారిని మూసి వేసే పనులను చేపట్టారు. ఇటీవలనే మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడం, గతంలో ఏఈ, డీఈలు సస్పెండ్ కావటం, టీపీఓలు సస్పెండ్, అకస్మిక బదిలీలు, మేనేజర్ సస్పెండ్ కావటంతో ఎందుకైనా మంచిదని వాయువ్యం దారిని మూసివేస్తున్నట్టు సిబ్బంది తెలిపారు.

విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్, పెన్నుల పంపిణీ



శంషాబాద్: పట్టణంలోని ఎస్సీ, బీసీ ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో విద్యనభ్యసిస్తోన్న సుమారు రెండువందల మంది పేద విద్యార్థులకు బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు చింతల నందకిశోర్ గుప్తా పరీక్షల ప్యాడ్లు, పెన్నులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు పరీక్షలను ధైర్యంగా ఎదుర్కొని ఉన్నతంగా రాణించాలని సూచించారు. కార్యక్రమంలో బండి శ్రీనివాస్, శ్రావణి, నాని, భరత్, సిద్ధు, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

టీ వర్క్స్‌ను సందర్శించిన ఎఫ్‌టీసీసీఐ, ఐసీటీ, ఐడీసీ ప్రతినిధి బృందం



రాయదుర్గం: హైదరాబాద్ నాలెడ్జి సిటీలో భారతదేశపు అతిపెద్ద నమూనా కేంద్రంగా గుర్తింపు పొందిన టీవర్క్స్ ప్రాంగణాన్ని శుక్రవారం ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌టీసీసీఐ) అందులో కమిటీలైన ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ (ఐసీటీ), ఇండస్ట్రీ డెవలప్‌మెంట్ సెల్(ఐడీసీ) సంయుక్త ప్రతినిధి బృందం సందర్శించింది. ఎఫ్‌టీసీసీఐ అధ్యక్షుడు మీలా జయదేవ్, ఐసీటీ చైర్మన్ మోహన్‌రాయుడు, ఐడీసీ చైర్మన్ శ్రీనివాస్ గరిమెళ్ళ నాయకత్వాలలో ప్రతినిధుల బృందం సందర్శించింది. టీ వర్క్స్ పనితీరును అడిగి తెలుసుకు న్నారు. ఈ సందర్భంగా ఎఫ్‌టీసీసీఐ అధ్యక్షుడు మీలాజయదేవ్ మాట్లాడుతూ తెలంగాణలో ఆవిష్కరణలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని స్వీకరించడానికి మా నిబద్ధతత టీ వర్క్స్ సందర్శన ద్వారా కనిపిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌టీసీసీఐ, ఐసీటీ, ఐడీసీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలని మంత్రికి వినతి



మంత్రి పొంగులేటికి వినతిపత్రం ఇస్తున్న కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి

మియాపూర్: మియాపూర్‌లోని సర్వే నంబర్ 100, 101లో ఉన్న ప్రభుత్వ భూమిపై సుప్రీంకోర్టు స్టేటస్ కోఆర్డర్ ఉన్నా కూడా ధరణిలో పట్టా పాసు పుస్తకం ఇవ్వడంపై సమగ్ర విచారణ చేయాలని జనం కోసం అధ్యక్షులు కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి శుక్రవారం రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కోరారు. ధరణిలో అక్రమాలు చేసిన అధికారులపై చర్యలు తీసుకుని ప్రభుత్వ భూమిని కాపాడాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మియాపూర్ సర్వేనంబర్ 100,101లలో వందలాది ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని గతంలో కొందరు కబ్జాలు చేశారని పలు న్యాయస్థానాల్లో ఓటమి చెంది చివరకు సుప్రీంకోర్టును ఆశ్రయించారన్నారు. ఈ భూమిపై సుమారు 25 సంవత్సరాల నుండి స్టేటస్ కో అమల్లో ఉందని , ఈ భూమిని కబ్జా చేస్తుంటే రెవెన్యూ, హెచ్ఎండీఏ అధికారులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ఓ వైపు కోర్టు ఆదేశాలు ఉన్న 100 సర్వే నంబర్‌లో ధరణి పట్టా పాసుపుస్తకం ఎనిమిది ఎకరాల భూమిని సాయిబాబా పేరుపై గత సంవత్సరం ఏప్రిల్ 22న జారీ చేశారని.. విచారణ జరపాలని భాస్కర్‌రెడ్డి కోరారు.

కాన్షీరామ్‌కు ఘన నివాళి



కాన్షిరామ్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

రాజేంద్రనగర్: బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పోరాడిన యోధుడు కాన్షీరామ్ అని మహనీయుల జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్ పచ్చ నర్సింగ్ రావు అన్నారు. శుక్రవారం రాజేంద్రనగర్ అంబేద్కర్ చౌరస్తాలో మహనీయుల జయంతి ఉత్సవాల కమిటీ ఆధ్వర్యంలో కాన్షీరామ్ 90వ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మహనీయుల ఆశయ సాధన కోసం నిరంతరం ప్రజలను చైతన్య పరుస్తూ పేద వర్గాల అభ్యున్నతికి కృషి చేసినప్పుడే మహనీయుల మార్గంలో నడిచిన వారవుతామన్నారు. కార్యక్రమంలో మహనీయుల జయంతి ఉత్సవాల కమిటీ ప్రధాన కార్యదర్శి ఎడ్లకాడి సూర్యం కోశాధికారి రగడంపల్లి శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల హక్కులపై అవగాహన ఉండాలి

> తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ ఎస్.కె.మహమూద్

గోల్కొండ: మహిళలు తమ హక్కులపై అవగాహన ఉన్నప్పుడే సమాజంలో నిలదొక్కుకుంటారని తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హైయర్ ఎడ్యూకేషన్ చైర్మన్ ఎస్.కె.మహమూద్ అన్నారు. మెహిదీపట్నంలోని సెంటైన్స్ మహిళా కళాశాలలో మహిళా సాధికారతపై శుక్రవారం జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కళాశాల ప్రిన్సిపాల్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడారు. ఒక మహిళ చదువుకుంటే మరేందరికో దారి చూపుతుందన్నారు. పురుషులకు దీటుగా మహిళలు అన్ని రంగాల్లో దూసుకెళ్తున్నారని పేర్కొన్నారు. మహిళా శక్తిని గుర్తించిన ప్రభుత్వం వారిని సాయుధ బలగాల్లో సైతం నియమిస్తుందని తెలిపారు. అయినా సమాజంలో ఇంకా మహిళలపై వివక్ష సాగుతుండడం విచారకరం అని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రెవరెండ్ సిస్టర్ ఆంథోనమ్మ మదర్ జనరల్, డాక్టర్ అనిత, ప్రొఫెసర్ తమ్మా కోటిరెడ్డి, ట్రైబల్ కల్చరల్ అండ్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ ఇఫ్లూ యూనివర్సిటీలకు చెందిన ప్రతినిధులతో పాటు ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ విజయరాణి, సదస్సు కన్వీనర్లు సునీత ఈసంపల్లి, పోతి దేవీనాథ్, అధ్యాపక బృందం, విద్యార్థినులు పాల్గొన్నారు.

నిద్రమత్తులో డ్రైవింగ్ చాలా ప్రమాదకరం



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ గురు ఎన్ రెడ్డి, డాక్టర్లు

> కాంటినెంటల్ ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ గురు ఎన్ రెడ్డి

రాయదుర్గం: నిద్రమత్తులో డ్రైవింగ్ చేయడం చాలా ప్రమాదకరమని కాంటినెంటల్ ఆస్పత్రి వ్యవస్థాపకులు, చైర్మన్ డాక్టర్ గురు ఎన్ రెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ నిద్ర దినోత్సవాన్ని (వరల్డ్ స్లీప్ డే)ను పురస్కరించుకొని నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని కాంటినెంటల్ ఆస్పత్రిలో శుక్రవారం అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సైబరాబాద్ పోలీస్ విభాగం, 50 మంది తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ ఉన్నతోద్యోగులు, కార్పొరేట్ సంస్థల ప్రతినిధులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డ్రంక్ అండ్ డ్రైవ్‌తో పాటు నిద్ర మత్తులో వాహనాలను నడపడం వల్లనే భారతదేశంలో 40 శాతం రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని అన్నారు. రోడ్డు ప్రమాదాలను పూర్తిగా తగ్గించేందుకు డ్రైవర్లంతా నిబంధనలకు అనుగుణంగా వాహనాన్ని నడిపేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు. రోడ్డు ప్రమాదాలపై ప్రతి ఒక్కరిలోనూ అవగాహన కల్పిస్తే చాలా వరకు ప్రమాదాలు తగ్గుతాయన్నారు. ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్ కృష్ణకాంత్, ఆర్టీసీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్. శైలజామూర్తి, డాక్టర్ పి శ్రీనివాస్ మాట్లాడారు. ఏఎస్సీ ఇన్ఫోటెక్ ఉపాధ్యక్షుడు అరుణ్‌బోడ, ఇతర సంస్థల ప్రతినిధులతో బాటు వైద్యులు పల్మనాలజిస్ట్ అండ్ స్లీప్ స్పెషలిస్ట్ డాక్టర్ నళిని నాగళ్ళ, న్యూరో సర్జన్స్ డాక్టర్ అజయ్‌రెడ్డి, డాక్టర్ రణధీర్‌కుమార్,ఇతర డాక్టర్లు పాల్గొన్నారు.

విద్యార్థులు మానసికంగా దృఢంగా ఉండాలి

గోల్కొండ: పదో తరగతి పరీక్షలు రాయనున్న విద్యార్థులు మానసికంగా ధృడంగా ఉండాలని తెలంగాణ సైకాలజికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సీనియర్ సైకాలజిస్ట్ డాక్టర్ ఎం.ఎ.ఖరీం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ నెల 18వ తేదీ నుంచి టెన్త్ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థుల సందేహాలు, వారి మానసిక సమస్యలను నివృత్తి చేసేందుకు ఈ నెల 18వ తేదీ నుంచి సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు 'ఫోన్ ఇన్' కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సైతం 9440488571, 040–35711791 నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

నిరుపేదలకు నిత్యాన్నదానం

గోల్కొండ: నిరుపేదలు, ప్రభుత్వ ఆసుపత్రులకు రోగుల వెంట వచ్చే సహాయకుల కోసం 733 రోజులుగా నిత్యాన్నదానం చేస్తున్నామని గోల్కొండ సెకండ్ లాన్సర్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మహ్మద్ బషీర్ అన్నారు. వివిధ ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద రోగుల సహాయకులకు శుక్రవారం ఆయన అన్నదానం చేశారు.